క్లుప్తంగా

పందుల పెంపకానికి స్థలం కేటాయింపు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని పందుల పెంపకందారులు తమ పందులను పోణంగి కంపోస్టు యార్డుకు తరలించి అక్కడ పెంచుకోవాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్ సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పోణంగి కంపోస్టు యార్డులో పందుల పెంపకానికి రెండెకరాల స్థలం కేటాయించామన్నారు. నగరం పరిధిలోని బహిరంగ, జనావాస ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజా జీవనానికి, పారిశుద్ధ్యానికి తీవ్ర ఆటంకంగా ఉన్న పందులను వాటి యజమానులు పోణంగి కంపోస్టు యార్డుకు తరలించాలని ఆదేశించామన్నారు. ఈ ఆదేశాలు పాటించని పక్షంలో హైకోర్టు ఆదేశాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

రోడ్లపైకి పశువులను విడిచి పెడితే కఠిన చర్యలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో రహదారులపై ఆవులు, ఎద్దులు విచ్చలవిడిగా సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. పశువులను రోడ్లపైకి విడిచి పెడితే వాటి యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఏ.భానుప్రతాప్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. వీధి పశువులకు సంబంధించి ఇప్పటికే సంబంధిత యజమానులకు అవగాహన కల్పించామన్నారు. దీనిపై నోటీసులు జారీ చేశామన్నారు. కొందరు పశువుల యజమానులు వారి వైఖరి మార్చుకోనందున సంబంధిత పశువులను గోసంరక్షణ సమితికి తరలించడంతోపాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు. పశువుల తరలింపు, వాటి పోషణకు అయ్యే ఖర్చును ఏపీ యాక్ట్ 1871 ప్రకారం యజమానుల వద్ద నుంచి వసూలు చేస్తామని పేర్కొన్నారు.

మూగ జీవాల తరలింపుపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఆవులను, దూడలను అక్రమంగా రవాణా చేస్తున్నారని, సరైన రక్షణ చర్యలు తీసుకోకుండా మూగజీవాలను తరలిస్తున్నారనే అభియోగంతో ఇద్దరు వ్యక్తులపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి వ్యానులో మూడు ఆవులు, మూడు దూడలను తీసుకువెళ్తుండగా ఏలూరుకు చెందిన గో రక్షకదళ సభ్యులు అడ్డుకుని త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వ్యాను, డ్రైవర్ పల్నాడు జిల్లా కోసూరి మండలం ఆవులూరిపాలెంకు చెందిన తిరుమల అశోక్‌పై ఆవులను పంపించిన రావులపాలెంకు చెందిన తిరుమల బ్రహ్మయ్యపై కేసు నమోదు చేశారు. వీటిని రావులపాలెం నుంచి సత్రంపాడుకు పంపిస్తున్నట్టు గుర్తించి కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఇసుక లేక ఇక్కట్లు


ఇసుక లేక ముందుకు సాగని భవన నిర్మాణం


ఓవర్ బ్రిడ్జి కింద పనుల కోసం వేచి చూస్తున్న నిర్మాణ రంగ కార్మికులు

- పేరుకే ఉచితం.. అవసరం తీరాలంటే అవస్థలే
- ఆన్‌లైన్లో బుక్ చేసుకున్నా గతం కన్నా 50 శాతం అధిక ధర
- బ్లాక్‌లో అయితే 75 శాతం ఎక్కువ ధర చెల్లించాల్సిందే
- గత ప్రభుత్వం హయాంలో రూ.20 వేలకే లారీ ఇసుక చేరవేత
- ప్రస్తుతం లారీ ఇసుక ధర రూ.30 వేల నుంచి రూ.35 వేలు

ఏలూరు (టూటౌన్): తాము అధికారం చేపడితే పూర్తిగా ఇసుకను ఉచితంగా అందజేస్తామని ఊదర గొట్టినకూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు నాలుగునెలలు కావస్తున్నా ప్రజలకు పూర్తిస్థాయిలో ఇసుకను అందించలేని దుస్థితిలో ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ హయాంలో ఏలూరు నగరానికి లారీ ఇసుక రూ.20వేలకే వచ్చేది. తాజాగా లారీ ఇసుక ధర రూ.30వేలు అవుతోంది. ఇంకా అర్జెంట్ అనుకుంటే మరో రూ.5వేలు అదనంగా వెచ్చించి రూ.35వేలు చెల్లించాల్సిందే. దీంతో నగరంలో నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. ఒక వేళ భవన నిర్మాణదారులు రూ.35వేలు వెచ్చించి లారీ ఇసుకను తెప్పిస్తే దానిలో కటాకటిగా 20 టన్నులే సరఫరా చేస్తున్నారు. దీంతో భవన నిర్మాణాల వ్యయం తడిసి మోపెడు అవుతుందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. పూర్తిగా ఇసుకను ఉచితంగా అందిస్తామని చెప్పి రకరకాల పేర్లతో దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో పక్క సరిపడా ఇసుక చవక ధరలో లభించకపోవడంతో నగరం పరిధిలోని అన్ని రకాల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు పూర్తిస్థాయిలో దొరకని పరిస్థితి ఏర్పడింది.

గత ప్రభుత్వం హయాంలో రూ.20వేలకే నగరానికి ఇసుక సరఫరా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో లారీ ఇసుక కేవలం రూ.20వేలకే ఏలూరు నగరానికి సరఫరా అయ్యేది. అదీ ఎంతో నాణ్యమైన ఇసుకను అందించే వారు. పైగా లారీకి 30 టన్నుల వరకు ఇసుక వచ్చేది. దీంతో అన్ని రకాల నిర్మాణాలు జోరుగా సాగేవి. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు నిత్యం పనులకు కొదవ ఉండేది కాదు. తాజాగా లారీ ఇసుక కోసం రూ.30వేలు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. శ్లాబ్ లాంటి వాటికి ఇసుక వెంటనే అవసరం పడితే మరో రూ.5వేలు అదనంగా వెచ్చించి లారీ ఇసుకకు రూ.35వేలు ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. లారీకి 20 టన్నుల ఇసుక మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో ఇటు ధర విషయంలో, అటు పరిమాణం విషయంలో వినియోగదారులు చేతులు కాల్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాగైతే నిర్మాణాలు ఎలా చేయగలుగుతామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనుల్లేక అల్లాడుతున్న నిర్మాణ రంగ కార్మికులు

ఏలూరు నగరం పరిధిలో వేల సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులున్నారు. గత ప్రభుత్వం హయాంలో వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు పనులకు ఢోకా ఉండేది కాదు. ప్రస్తుతం దానికి భిన్నంగా వారంలో సగం రోజులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయంటూ భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరం మేరకు ఇసుక సరఫరా లేకపోవడమే దీనికి కారణంగా భవన నిర్మాణ కార్మికులు చెబుతున్నారు.

పని దొరకడం లేదు



గతంలో వారంలో ఆరు రోజులు తప్పని సరిగా పనులు దొరికేవి. ప్రస్తుతం వారంలో మూడు నుంచి నాలుగు రోజులే పనులు ఉంటున్నాయి. వారంలో రెండుమూడ్రోజులు ఖాళీగానే ఉంటున్నాం. వచ్చే చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోవాలంటే కష్టంగా ఉంది. దీంతో సగానికి సగం ఖర్చులను తగ్గించుకుని పొదుపుగా జీవించాల్సిన దుస్థితి ఏర్పడింది. – కె.కోటేశ్వరరావు, భవన నిర్మాణ రంగ కార్మికుడు, ఏలూరు

పనికోసం వెళ్లి వెనక్కి వస్తున్నాం



ప్రతి రోజు తాపీ పనికోసం స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి సెంటర్‌కు వెళ్లటం ఒక్కోసారి పనులు లేక కాళ్లు ఈడ్చుకుంటూ వెనక్కి రావడం జరుగుతోంది. అనుకున్న సమయానికి ఇసుక లభించకపోవడం వల్ల చాలా సందర్భాల్లో ఈ పరిస్థితి ఎదురవుతోంది. గతంలో ఇటువంటి పరిస్థితి తలెత్తేది కాదు. అవసరం మేరకు ఇసుకను అధికారులు సరఫరా చేయాలి – వి.అప్పలరాజు, తాపీ మేస్త్రి, తంగెళ్లమూడి, ఏలూరు

ఉచితం అని చెప్పి బాదేస్తున్నారు



ఇసుకను పూర్తి ఉచితంగా అందిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు తాజాగా రెట్టింపు ధరలు వసూలు చేస్తూ బాదేస్తున్నారు. గతంలో తక్కువ ధరకు నాణ్యమైన ఇసుక సరఫరా అయ్యేది. ప్రస్తుతం అధిక రేటు, క్వాలిటీ తక్కువగా ఉన్న ఇసుకను పొందాల్సి వస్తోంది. మొత్తంగా మా లాంటి భవన నిర్మాణ కార్మికులకు బాధలు తప్పడం లేదు. – బి.చంద్రశేఖర్, తాపీమేస్త్రి, లంకపేట, ఏలూరు

ఏలూరు కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్

ఏలూరు (టూటౌన్): వర్షాల నేపథ్యంలో ఏలూరు కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా రాబోవు రోజుల్లో ఏర్పడు భారీ వర్షాల దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఏదైనా సహాయ సహకారాలు అవసరమైతే ఫోన్ నంబర్లు 08812–232101, 08812–222200లో సంప్రదించాలని కమిషనర్ కోరారు.

విపత్తులపై అవగాహన అవసరం


వి శ్రీలత

ఏలూరు రూరల్: అకాలంగా సంభవించే విపత్తులపై అవగాహన పెంచుకోవడం వల్ల ప్రజలకు వేగంగా సేవలు అందించవచ్చని ఏలూరు రూరల్ ఎంపీడీఓ వి శ్రీలత అన్నారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆమె ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీఎస్‌డీఎంఏ) శిక్షణ తరగతిలో పాల్గొని తిరిగి నగరానికి వచ్చారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. విపత్తుల సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో శిక్షణ తరగతిలో తెలుసుకున్నానని వివరించారు. తుఫాన్, వరదలు, భూకంపం, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అధికారులు ముందుగా తీసుకునే చర్యలు ఎంతో విలువైనవి అన్నారు. విపత్తులు సమయంలో వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు నిస్సహాయ స్థితిలో ఉంటారన్నారు. సహాయక సిబ్బంది, అధికారులు వీరికి మొదట సాయం అందించాలన్నారు. దేశంలో సంభవించిన అనేక విపత్తుల్లో చేపట్టిన చర్యలపై శిక్షణలో అధికారులు, నిపుణులు వివరించారన్నారు. శిక్షణ పొందిన వారిలో అగ్నిమాపక, పోలీసు, ఐసీడీఎస్, స్థానిక సంస్థల అధికారులు ఉన్నారని చెప్పారు.

హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరిపాలన అధికారికి తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డీఎస్వీడీ ప్రసాద్, కార్యదర్శి టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలు 5 ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నీలాదేవి, విజయకుమారి పాల్గొన్నారు.

సందడిగా మద్యం షాపుల లాటరీ ప్రక్రియ


మద్యం టెండర్ల ప్రక్రియకు హాజరైన మహిళలు


టెండర్ హాలులో టోకెన్ నెంబర్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది


డ్రాలో వచ్చిన టోకెన్ నంబరును చూపిస్తున్న ఎక్సైజ్ అధికారి, చిత్రంలో జేసీ పి.ధాత్రిరెడ్డి

మినీ బైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో సోమవారం మద్యం షాపులకు లాటరీ ప్రక్రియ సందర్భంగా సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు దాఖలు చేసిన వేలాది మంది వ్యాపారులు తరలివచ్చారు. ఏలూరు మినీ బైపాస్ వద్ద మద్యం టెండర్లకు సెంటర్ వద్ద కార్లు బారులు తీరాయి. మద్యం టెండర్ల వద్ద వ్యాపారుల హడావుడి కనిపించింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన లాటరీ ప్రక్రియ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. టెండర్ హాలులోనే బ్యాంకర్లు ప్రత్యేక క్యాష్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. టెండర్ల ప్రక్రియ నిర్వహించే ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. పాసులున్న వారిని మెటల్ డిటెక్టర్లతో పరిశీలించి లోపలికి అనుమతించారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో బారికేట్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పోలీస్ బందోబస్తును ఎస్పీ కె.ప్రతాపశివకిషోర్ పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు


టెండర్ల ప్రక్రియ వీక్షించేలా ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు


మద్యం టెండర్ల సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్లు


మద్యం టెండర్ల కేటాయింపు సెంటర్ వద్ద పోలీస్ బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ కె.ప్రతాపశివకిషోర్


మద్యం టెండర్ల సెంటరు వద్ద వాహనాల పార్కింగ్


ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో నిర్వహించిన మద్యం టెండర్ల వద్ద మద్యం వ్యాపారులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - జేడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర)	20.15	00
ఏలూరు - తిరుపతి	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	35
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.20	98505	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	00

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50-60	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	58	చిక్కుడు కాయలు	60-120
వంకాయలు (కాంతులు)	68	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07,10
బెండకాయలు	30	కంద	60
పచ్చిమిర్చి	44-48	బీట్‌రూట్	40
కాకర కాయలు	34-44	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	120
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70-150
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	50-56	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	30-55	గోంగూర	07
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	36-40	బఠాణీ	--
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	46

ఖరీఫ్ సాగుకు తెగుళ్ల బెడద


ఎండాకు తెగులు సోకిన వరి పైరు

గణపవరం: రెండు వారాలుగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల ప్రభావం ఖరీఫ్ పంటపై పడింది. పగలు వేసవిని తలపించేలా విపరీతమైన ఎండలు, ఉన్నట్టుండి అకస్మాత్తుగా ఆకాశం మబ్బులతో నిండి వర్షాలు పడటం, రాత్రి వేళల్లో మంచు కురియడం వంటి పరిస్థితులతో ఖరీఫ్ పంటను రకరకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. సూర్యోదయం నుంచే విపరీతమైన ఎండ కాయడంతో పాటు ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న విపరీత మార్పుల కారణంగా వరి పంటపై బ్యాక్టీరి యా ఎండాకు తెగులు ముప్పేట దాడిచేసి రై తులను ఆందోళనకు గురి చేస్తోంది. దీని కారణంగా దిగుబడిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

30 శాతం పైరుకు ఎండాకు తెగులు

ఉంగుటూరు నియోజక వర్గంలోని నాలు గు మండలాల్లో సుమారు 62 వేల ఎక రాల విస్తీర్ణంలో ఖరీఫ్ వరిసాగు చేస్తున్నా రు. దీనిలో దాదాపు 30 శాతం పైరు ఎండాకు తెగులుకు గురైనట్లు అంచనా. ఎండలు తగ్గి వర్షాలు పడటంతో పదిరోజులుగా ఎండాకు తెగులు వ్యాప్తి అదుపు లోకి వచ్చిందని అధికారులు తెలిపారు. ఖరీఫ్‌లో ఎక్కువగా స్వర్ణ రకం, సంపద రకాలు సాగు చేస్తున్నారు. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో వరి ఈనిక దశలో ఉంది. భారీ వర్షాలు, వరదల కారణంగా పైరు కుళ్లిపోయి రెండోసారి నాట్లు వేసిన పొలాలు, ఆలస్యంగా నాట్లువేసిన పొలాల్లో పైరు దుబ్బుచేసే దశలోనూ, చిరుపొట్ట దశలోనూ ఉన్నాయి.

ఎండాకు తెగులు గుర్తించడం ఇలా

వరి దుబ్బు చుట్టూ ఉన్న ఆకులు పసుపు రంగులోకి మారి తర్వాత ఎండిపోతాయి. ఈనిక దశలో ఉన్న దుబ్బులకు ఈనిక రాకుండా దిగుబడి తగ్గిపోతుంది తెగులు సోకిన వరి మొక్క ఆకులపై బూడిద రంగు మచ్చలు ఏర్పడి వాటి నుంచి తెల్లగా జిగురు పదార్థం స్రవిస్తుంది. ఎండాకు తెగులు ఒక దుబ్బు నుంచి మరో దుబ్బుకు వేగంగా వ్యాపిస్తుంది. వరికి సోకే తెగుళ్లన్నింటిలోకి ఎండాకు తెగులు ప్రమాదకరమైనది. చిరుపొట్ట, గింజ పాలుపోసుకునే దశలో ఈతెగులు ఆశిస్తే గింజ గట్టిపడకుండా చేయడంవల్ల దిగుబడిపై గణనీయంగా ప్రభావం చూపుతుంది. ఈతెగులు వ్యాప్తి చెందకుండా రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బంది పొలం బడి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.